# కథ

**వి.ఎల్.పద్మసుందరి**

**రాత్రి తొమ్మిది గంటల సమయం. రోజువారీ బిజీ లైఫ్‌లో ప్రతి పనిని వేగంగా చేయడానికి అలవాటు పడిన రాఘవ రాత్రి భోజనాన్ని కూడా త్వరత్వరగానే కానిస్తున్నాడు. అతను వచ్చిన దగ్గర నుండి చెప్పా లని ఆత్రపడిన విషయాన్ని మెల్లగా కదిపింది శోభ.**

# ఎవరు ముఖ్యం?

''మా తమ్ముడు శ్రీనుకి ఏదో ప్రయివేట్ కంపెనీలో జాబ్ వచ్చిందిట. కాస్త నీ దగ్గరుంచుకొని వాడి మంచి చెడ్డలు చూడమ్మా అని మధ్యాహ్నం నాన్న ఊరు నుండి ఫోన్ చేశారు'' కూర వడ్డిస్తూ చెప్పింది.

తినడం ఆపి భార్య మొహంలోకి చూసి కళ్ళు చిట్లించాడు రాఘవ.

''మన దగ్గరా? ఇదేం రాజమహలా? ఎంతమందికైనా సరిపోవడానికి. ఆఫ్ట్రాల్ టూ బెడ్‌రూమ్ ఫ్లాటు. ఇప్పటికే ఇందులో అమ్మా, నాన్న, నువ్వు, నేను, హరి, శ్వేత ఆరుగురు ఉంటున్నాము. ఇంక శ్రీను కూడా వస్తే నా నెత్తిమీద ఉండాలి'' విసుక్కున్నాడు.

తండ్రి అన్న తీరుకి కిసుక్కున నవ్వాడు పన్నెండేళ్ళ హరీంద్ర.

చురుక్కుమన్నట్లు చూసింది శోభ. ''తినడం అయ్యిందిగా! వెళ్ళి తాతయ్య దగ్గర కూర్చుని చదువుకో'' ఆజ్ఞాపిస్తున్నట్లు హెచ్చరించి కొడుకును పంపేసింది.

''అత్తయ్యా, మామయ్యా పెద్దవాళ్ళే కదా! శ్రీను వాళ్ళ గదిలో ఉంటాడు. కావాలంటే శ్వేతను మన దగ్గర పడుకోపెట్టుకుందాం. కాస్త సర్దుకుంటే వాడొక్కడూ భారం ఏమీ కాదు'' పరిష్కారం చూపుతున్నట్లు అంది శోభ.

స్వతహాగా వాదనలకి దూరంగా వుండే రాఘవ ''చూద్దాం..లే'' కాస్త అయిష్టంగా అన్నాడు తినడంలో నిమగ్నమౌతూ. అతని భోజనం పూర్తయ్యేసరికి ఆ మాటను ''సరే నీ ఇష్టం'' అనేలా భర్తని ఒప్పించి తమ్ముడిని రప్పించుకోవడానికి లైన్ క్లియర్ చేయించుకుంది శోభ.

హాల్లో కూర్చుని పిల్లల్ని చదివిస్తూ కొడుకు కోడలి సంభాషణ వింటున్న హరిశ్చంద్రమూర్తి చిన్నగా నిట్టూర్చారు. బావమరిదిని ఇంట్లోకి తెచ్చి పెట్టుకునే విషయమై రాఘవ తండ్రిని సంప్రదించలేదు. ఒకవేళ సంప్రదించినా మూర్తి వ్యతిరేకించే వాడు కాదు. కారణం ఎక్కడో ఆంధ్రాలోని పల్లెటూరులో స్కూలు టీచరుగా రిటైరై భార్య శారదకున్న కీళ్ళవాతం కారణంగా తరచూ డాక్టర్ల దగ్గరకు తిరగవలసి ఉన్నందున తనకొచ్చిన సొమ్ముతో భార్యా సమేతంగా వచ్చి ఒక్కగానొక్క కొడుకు నీడన సేదతీరుతున్నారు ఆ దంపతులు. శోభతోను, రాఘవతోను వాళ్ళకేం విభేదాలు లేవు, అలాగని పెద్దగా వీళ్ళు చేసిందీ ఏమీలేదు. మూర్తి రిటైరైనాకా వచ్చిన తన డబ్బుని, పెన్షన్‌ని తన ఇష్ట ప్రకారం ఖర్చుపెడతాడు. రాఘవ, శోభా ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో వాళ్ళ కుటుంబ బాధ్యతలు వాళ్ళే చూసుకుంటారు. కొడుకుగా రాఘవ, తండ్రిగా మూర్తి తమ పరిధిలు దాటకపోవటం వల్ల కావచ్చు ఇంతవరకూ వాళ్ళ మధ్య సమస్యలు లేవు. ఇప్పుడు శ్రీను ప్రవేశం ఏ మార్పులు తేనుందో..ఆలోచిస్తున్న మూర్తి మరోసారి గాఢంగా నిట్టూర్చాడు.

* * *

సిటీలోని అపార్టుమెంట్ల సంస్కృతి ఒక మినీ భారత్‌ని తలపిస్తుంది. రాఘవ ఉండే పదంతస్తుల సిరి ఎన్‌క్లేవ్ కూడా అందుకు అతీతం కాదు. ఉదయం పదకొండు దాకా ఆ అపార్టుమెంట్‌లోని లిఫ్టులు కిల కిలలాడే కన్నె పిల్లలతో, ఉద్యోగులతో బిజీ బిజీగా ఉంటాయి. వచ్చిన తొలిరోజే శ్రీను లిఫ్టులో తన చుట్టూ నిలబడిన అందాల భామలను చూసి ఆశ్చర్యంతో బిగుసుకుపోయాడు. అందులో ఓ సుకుమార సుందరి- మూర్తి దగ్గరికి వచ్చి ''నమస్తే బాబుజీ'' అంటూ గలగలా హిందీ, ఇంగ్లీషులలో మాట్లాడేస్తుంటే ఎలాగైనా తనూ మాట కలిపి మూర్తికి బంధువునని చెప్పుకొని పరిచయం చేసుకోవాలని తపించిపోయాడు. అందుకే సందర్భం కాకపోయినా చొరవచేసి ''హాయ్, అయామ్ నివాస్. సన్ ఇన్ లా ఆఫ్ బాబుజీ'' అంటూ వచ్చిరానీ ఇంగ్లీషుతో ఆమెకి అడ్డంపడి వాళ్ళ సంభాషణలో దూరిపోయాడు.

తను చెబుతున్న విషయాన్ని ఆపి- ''సో..వాట్?'' ఎగాదిగా చూస్తూ ప్రశ్నించింది ఆ అమ్మాయి.

వెంటనే ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు శ్రీనుకి. అతను ఆ సందిగ్ధంలో నుండి తేరుకోకముందే లిఫ్ట్‌గ్రౌండ్ ఫ్లోర్‌ని చేరుకోవడంతో ''ఫిర్ మిలేంగే బాబుజీ'' మూర్తికి చెప్పి, శ్రీను వంక నిరసనగా చూస్తూ వెళ్ళిపోయింది.

''మామయ్యగారు..ఆ అమ్మాయి మీకు బాగా తెలుసా?'' బయటకి నడుస్తూ ఆత్రంగా అడిగాడు శ్రీను.

''మన ఎదురు ఫ్లాట్‌లోనే ఉంటుంది. పేరు రూపాలి కౌర్. వాళ్ళ నాన్న భూపేంద్ర కౌర్- సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఆ అమ్మాయి తరచు పాదాల పగుళ్ళతో బాధపడుతుంటే, నేను గమనించి హోమియోపతి మెడిసిన్ ఇచ్చాను. అది బాగా పనిచేయడంతో కలిసినప్పుడల్లా అభిమానంగా మాట్లాడుతూ ఉంటుంది'' చెప్పాడు మూర్తి.

''నాకు ఆ అమ్మాయిని పరిచయం చేస్తారా మామయ్యగారు?'' ఆశగా అడిగాడు.

ఎందుకూ అని అడగబోయి వయసులో ఉన్న శ్రీను ఉద్దేశ్యం అర్థమయ్యి చిన్నగా నవ్వేశారు. ''ఆ అమ్మాయి సింధీ పిల్ల. వాళ్ళ సంగతి నీకు తెలియదు. పిచ్చివేషాలు వేస్తే ప్రాణాలు తియ్యడానికి కూడా వెనుకాడడు ఆ పిల్ల తండ్రి'' హెచ్చరిక గా అన్నారు.

శ్రీను మొహం ఉక్రోషంతో ఎర్రబడిపోయింది. ''మీకిష్టం లేకపోతే మానెయ్యండి. నా దారిలో నేను ప్రయత్నిస్తాను'' కోపంగా అని విసవిసా వెళ్ళిపోయాడు.

అతని వయసు దూకుడుకి మనసులోనే నవ్వుకున్నారు మూర్తి.

* * *

రోజులు గడుస్తున్నాయి. శ్రీను రాక వల్ల శారద, మూర్తి దంపతులకి సమస్యలు పెరుగుతున్నాయి. రూపాలిని పరిచయం చెయ్యలేదనే కోపంతో శోభకి అత్తమామల మీద శ్రీను పితూరీలు పెరిగాయి. దానికితోడు ఆ ఇంట్లో జరిగే

చెదురు, మదురు సంఘటనలు అందుకు తోడవ్వ సాగాయి. అలాంటిదే ఓ సంఘటన ఆ కుటుంబ సమస్యను తీవ్రం చేసి మూర్తి దంపతుల ఉనికిని ప్రశ్నార్థకంలో పారేసింది.

ఆరోజు..

తను తయారయ్యి, పిల్లల్ని తయారుచేసి పంపే హడావిడిలో బిజీగా ఉన్న శోభ పిల్లలకి కేరేజ్ సర్ద డానికి వంటింట్లోకి వచ్చి గిన్నెలు ఖాళీగా ఉండ డంతో- ''అత్తయ్యా... అత్తయ్యా'' అని శారదని పిలుస్తూ వచ్చింది.

శారద చేతులు నొక్కుకుంటూ పదే, పదే బాత్ రూమ్ వంక చూస్తూ గదిలో అసహనంగా పచార్లు చేస్తోంది. శోభ పిలుపుకి కంగారుగా హాల్లోకి వచ్చింది.

''వంటింట్లో గిన్నెలన్నీ ఖాళీగా ఉన్నాయి వంట చెయ్యలేదా?''

పేపర్ చదువుతున్న మూర్తి, షేవింగ్ చేసు కుంటున్న రాఘవ తిరిగి చూశారు.

ఇబ్బందిగా కదిలింది శారద ''లేదు శోభా, ఇవాళ ఒంట్లో కాస్త నలతగా ఉన్నట్లు అనిపించి స్నానం చెయ్యడానికి బద్ధకించాను. పాచిబట్టలతో వంట చెయ్యడం ఇష్టం లేక వంట చెయ్యలేదు'' సంజాయిషీ ఇస్తు న్నట్లు మెల్లగా చెప్పింది.

శోభకి ఆగ్రహంతో మతిపోయింది. ''మీకు వంట చెయ్యడం ఇష్టం లేకపోతే ఉదయం కాఫీ కలిపేటప్పుడే చెప్పకూడదదు, నీ ఏడుపు నువ్వు ఏడవమని చెప్పొచ్చుగా! ఇప్పుడు చూడండి. మీరు చేసిన పనికి ఈ రోజంతా మేము తిండి లేకుండా మాడాలి'' భర్త, మామగారు అక్కడే ఉన్నారని మర్చి పోయి గట్టిగా కసురుకొంటూ అంది.

శోభ ఎప్పుడూ అంత రేష్గా మాట్లాడక పోవడంతో సిగ్గుగా తలొంచుకుంది శారద.

శ్రీను బాత్‌రూమ్‌లో నుండి తల తుడు చుకుంటూ అక్కడికి వచ్చేశాడు. ''అయితే ఇవాళ్టికి మనమంతా పస్తేనా?'' వస్తూనే అక్కని అడిగాడు.

శోభ సమాధానం చెప్పేలోగానే రాఘవ సీరియ స్గా రియాక్ట్ అయ్యాడు.

''ఏయ్.. ఏమిటా వాగుడు? అమ్మకి వంట్లో బాగోక వంట చెయ్యలేకపోతే నిన్ను పిలిచి ఆ విషయం చెప్పాలా? ఏం పదిసార్లు వంటింట్లోకి తిరిగావు. ఆమాత్రం గమనించి కుక్కర్ పెట్టుకో లేవా? అయినా ఇంట్లో వండకపోతే, ఇంక వేరే దారే లేదా. ఏం? హరికి డబ్బులిచ్చి శ్వేతకి, వాడికి టిఫిన్ కొనుక్కుని పట్టుకెళ్ళమను. నువ్వూ నేను కేంటీ న్‌లో తినొచ్చు. నాన్నగారికి, అమ్మకి నేను హోటల్ నుండి కేరేజ్ పంపిస్తాను. చిన్న విషయానికి పెద్ద రాద్ధాంతం చెయ్యకు'' తీవ్రంగా చెప్పాడు.



''అంతకన్నా చేసేది ఏం ఉంది కనుక'' గొణు క్కుంటూ చెరో చేత్తో పిల్లల్ని బెడ్ రూమ్‌లోకి లాక్కొని వెళ్ళిపోయింది శోభ.

''నేను కూడా బయటే తినాలా?'' డబ్బు దండగ అన్నట్లు అడిగాడు శ్రీను.

''అక్కరలేదు. ఇవాళ్టికి ఉపవాసం ఉండు. కొవ్వు తగ్గుతుంది'' వెక్కిరించాడు రాఘవ.

బావగారికేసి మింగేసేలా చూసి విసురుగా గది లోకి వెళ్ళిపోయాడు శ్రీను.

శారద మెల్లగా వచ్చి సోఫాలో కూలబడిపో యింది. డీలాపడినట్లున్న ఆమె మొహం నిజంగానే జ్వరపడినట్లుగా ఉంది.

''రఘూ, అమ్మని ఓసారి డాక్టర్‌కి చూపించి, అన్నం తినొచ్చు అంటే కేరేజ్..నేను తెస్తాను. నువ్వు ఆఫీసుకి వెళ్ళు. మళ్లీ నీకు లేటవుతుంది'' కొడుకుని ఉద్దేశించి చెప్పారు మూర్తి.

''మీ ఇష్టం నాన్నా!'' అని చెప్పి తను తెమల డంలో లీనమైపోయాడు రాఘవ. మరో అరగం టకి అందరూ వెళ్ళిపోయాకా మూర్తిగారు ఇంకా సోఫాలోనే కూర్చుని ఉన్న శారద ప్రక్కన కూర్చొని నుదురు తాకి చూస్తూ..''నీరసంగా ఉందా? డాక్టర్ దగ్గరకి వెళదామా?'' అని ఆప్యా యంగా అడిగారు.

ఏదో తెలియని అసహనంతో ఆయన చేతిని విసురుగా లాగేసింది. అప్పటికే ఆమె కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలుతున్నాయి.

''శారదా!'' కాస్త ఆందోళనగా పిలిచారు.

''నాకే రోగం లేదు పాడూలేదు. ఇన్నాళ్ళు ఆ గదిలో ఉండేది మీరు, నేను ఇద్దరే కనుక ఉద యాన్నే ఐదింటికి లేచి రెండు చెంబులు పోసుకొని గదిలోకి వచ్చి చీర కట్టుకుని నా పనులు నేను చూసుకునేదాన్ని. ఇప్పుడు ఆ శ్రీను వచ్చినప్పటి నుండి ఏడైనా కానీ లేపినా లేవడు. ఎంత పడుకొని ఉన్నా వయసులో ఉన్న పరాయి కుర్రాడు ముందు గుడ్డలు మార్చుకోలేక బాత్‌రూమ్‌లోనే కట్టుకొని వస్తుంటే తడిసిపోయిన చీర ఒళ్ళంతా కంపరాన్ని కలిగిస్తోంది. ఈరోజు ఏకాదశి. రోజూ ఎలా వండుకు మింగినా ఈ రోజైనా కాస్త శుచిగా వండు దామని వాడి స్నానం అయ్యాక చేద్దామని ఆశప డ్డాను. దరిద్రుడు. పంతం పట్టినట్లు ఎనిమిదైనా స్నానానికి కదలలేదు. వంట లేటయ్యి ఇంత రాద్ధాం తమయ్యింది'' చీరకొంగుతో కారిపోతున్న కళ్ళు, ముక్కు తుడుచుకుంటూ ఆగి ఆగి చెప్పింది తన మానసిక వేదన.

మూర్తిగారు చిన్నగా నిట్టూర్చారు. ''ఇంకా నీకు స్నానం చేస్తేకానీ వండకూడదనే ఆచారాలు ఉంటే

ఎలా శారదా? సిటీలో అలాంటివి కష్టం. కాస్త నువ్వే మారాలి. నీకు మరీ చాదస్తం అయితే లేవగానే పిల్లలకి వండి పెట్టేసి, స్నానం చేసేక మనిద్దరికి వండు. ప్రస్తుతానికి ఇదొక్కటే మార్గం'' నచ్చచెబుతున్నట్లు అన్నారు.

చివ్వున లేచింది శారద. ''అంతే. ఆధారపడ్డం వాళ్ళం కదా! మనమే మారాలి'' రోషంగా అని విసురుగా తమ గదిలోకి వెళ్ళిపోయింది.

శారద గొంతులో అణచి పెట్టిన బాధ ఆయన గుండెల్ని తాకింది. లేచి పచార్లు చేస్తూ..'ఈ సమస్యకి ఓ పరిష్కారం చూపాలి. సాధ్యమైనంత త్వరలో శ్రీనుని బయటకి పంపడమో, శారదతో నేను ఊరు వెళ్ళిపోవడమో జరగాలి' సాలోచనగా అనుకుంటున్న ఆయన దృష్టి కిటికీలో నుండి కనిపించిన రూపాలి మీద పడింది. ఆయనలో ఓ చిన్న ఊహ మెరుపులా కదిలింది. 'శ్రీను గాడిని బయటికి పంపడానికి రూపాలిని ప్రయోగిస్తే..' ఆ ఊహకే ఆయనలో సంతోషం పొంగింది. వెంటనే అందుకు అవసరమైన ప్లాన్‌ని రచించడంలో నిమగ్నమయ్యారు.

★ ★ ★

ప్లాన్ వర్కవుట్ అయ్యింది. 'నివాస్' అనే సంతకంతో శ్రీను లవ్ లెటర్ రూపాలి కొరకి, ఆమె తండ్రికి చిక్కింది. భూపేంద్ర అగ్గిమీద గుగ్గిలంలా మండిపడి శోభని, శ్రీనుని రాఘవని కారిడార్‌లో నిలబెట్టి నానా భాషల్లో కడిగేసి మరోసారి తన కూతురుకేసి చూస్తే తల్వార్‌తో నరికేస్తానని కత్తితో బెదిరించి మరీ వదిలాడు..ఫ్లాట్స్‌లోని వాళ్ళంతా ఫ్రీ షో చూసినట్లు చూడడం, భూపేంద్ర ఆగ్రహంతో బాగా బెదిరిపోయిన శోభ తమ్ముడిని ఛడామడా తిట్టి తన ఇంట్లోంచి సొమ్మని సూట్‌కేస్ తెచ్చి విసిరేసింది.

''నన్ను నమ్మవే. ఆ లెటర్ నేను రాయలేదక్కా'' వేడుకున్నాడు కన్నీళ్ళతో శ్రీను.

''పోన్లేమ్మా! రాయలేదు అంటున్నాడుగా..అయిందేదో అయింది. వదిలెయ్'' మూర్తి పెద్దరికం ప్రదర్శించారు.

శోభ వినలేదు. ''మీకు తెలియదు మామయ్యా వీడే రాసుంటాడు. ఆ బట్లర్ ఇంగ్లీషు, ఎస్.నివాస్ అని సంతకం చెయ్యడం అన్నీ వీడి లక్షణాలే. వీడికి ఇదేం కొత్త కాదు. ఇంతకుముందు మా ఊరు మునసబు కూతురికి కూడా ఇలాగే పైత్యపు రాతలు రాసి తన్నులు తిన్నాడు. మా నాన్న మొహం చూసి ప్రాణాలతో వదిలేశారు. మళ్ళీ ఏ వెధవ వేషాలు వేస్తాడో అని భయపడే నాన్న వీడిని నా దగ్గర ఉంచారు. ఐదేళ్ళుగా ఈ ఫ్లాటులో ఉంటున్నాం. ఏడాదిగా మీరూ మాతో ఉన్నారు. ఒక్కసారైనా ఎవరైనా నన్ను, మీ అబ్బాయిని చెడుగా కామెంట్ చెయ్యడం విన్నారా? ఇదిగో, వీడొచ్చి పూర్తిగా నెల కాలేదు మా బ్రతుకు నడివీధిలో పెట్టేశాడు. నా వల్ల కాదు భరించడం. వాడి ఏడుపు వాడు ఏడుస్తాడు. పోనియ్యండి'' అంటూ బయటికి నెట్టి తలుపులు మూసి ఏడుస్తూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

చిత్రంగా శోభ నిర్ణయాన్ని రాఘవ కూడా వ్యతిరేకించలేదు. మౌనంగా ఉండిపోయాడు. ఆ రాత్రి శారద, మూర్తిని అడిగింది. ''ఆ లెటరు మీరు కల్పించిందే కదూ!''

ఒక్క క్షణం విస్మయపడ్డట్టు చూసి పెదాలు బిగించి తల అడ్డంగా ఊపారు. ''శ్రీనును ఇంట్లోంచి పంపడానికి ఆ సింధీ పిల్లను ప్రయోగించాలని నేను అనుకోవడం వాస్తవమే కానీ..ఓ చిన్న లెటర్‌తో పంపగలమనే ఆలోచన నాకు రాలేదు. శ్రీనుగాడి వయసును ఆ పిల్లమీద ఆకర్షణను రెచ్చగొట్టి రూపాలి ముందు పోకిరిలా చూపించి, ఛీకొట్టించి..అవమానంతో వాడంతట వాడే ఇక్కడి నుండి వెళ్ళిపోయేలా చెయ్యాలి అనుకున్నాను. నా ప్లాన్ అమలుకాకముందే ఇదంతా జరిగిపోయింది'' వివరించాడు.

''మీరు రాయలేదా? అయితే శోభ అనుమానించినట్లు శ్రీనుగాడే రాసి ఉంటాడు. దొంగ వెధవ. పైకి ఎంత ముంగిలా ఉంటాడు'' మెటికలు విరిచింది.మూర్తిగారు సాలోచనగా తలూపారు. కానీ ఆయనకి మనసులో ఏ మూలో ఆ ఉత్తరం శ్రీను రాసింది కాదు అనిపించసాగింది.

★ ★ ★

ఉదయాన్నే శోభ పిల్లలతో మనశ్శాంతి కోసం చిలుకూరు బాలాజీ గుడికి వెళ్ళిపోయింది. రాఘవ ఆఫీసులో ఆడిటింగ్ వల్ల తప్పనిసరిగా ఉండిపోయాడు. భర్త భోజనం బాధ్యత చూసుకోవడానికి అత్తగారు ఉండడంతో నిశ్చింతగా తమ్ముడివల్ల కోల్పోయిన మనశ్శాంతి దైవసాన్నిధ్యంలో వెతుక్కుంటూ వెళ్ళిపోయింది.

స్వేచ్ఛగా, సంతృప్తిగా తన పనులు పూర్తి చేసుకొని మడిగా కొడుక్కి వండి పెట్టడంలో మునిగి ఉంది శారద. అది గమనించి రాఘవ గదిలోకి వెళ్ళారు మూర్తి. ఆఫీసుకి రెడీ అవుతున్న రాఘవ నుద్దేశించి, ''రఘూ! ఆ లెటర్ ఎందుకు రాశావు?'' అని అడిగారు.

టై నాట్ బిగించుకుంటూ వెనక్కి తిరక్కుండానే ''నేనే ఆ లెటర్ రాశానని మీరెందుకు అనుకుంటున్నారు?'' తండ్రిని ప్రశ్నించాడు.

మూర్తిగారు నవ్వుతూ- ''నీకు ఓనమాలు నేర్పిందే నేను. నువ్వు ఏ అక్షరాన్ని ఎలా వంచుతావో నాకు బాగా తెలుసు'' రాఘవ మొహం గంభీరంగా మారింది. మంచం మీద కూర్చుని సాక్స్ తొడుక్కుంటూ ''శ్రీనుని మనింట్లో పెట్టుకోవడం నాకు మొదటి నుంచీ ఇష్టం లేదు. శోభ పత్తిడికి సరే అన్నా రోజు రోజుకీ వాడి ప్రవర్తనలోని విపరీతం, మిమ్మల్నే ఇంట్లోంచి పంపించెయ్యాలని శోభకి వాడు చెప్పే లేని పోని నేరాలు గమనిస్తూనే ఉన్నా. కానీ శోభతో మీ తమ్ముడిని పంపించెయ్యి అంటే ఇంట్లో ఉన్న మనశ్శాంతి పోతుంది. అందుకే!..'' అంటూ నవ్వాడు.

మూర్తి నవ్వలేదు ''అందుకే...'' రెట్టించారు.

''శ్రీను రూపాలికి కటింగులివ్వడం చాలాసార్లు చూశాను. ఊర్లో వాడి ప్రేమభాగోతం, ఆ లవ్ లెటర్ కూడా నేను చూశాను. అందుకే ఇంచుమించు అలాగే రాసి, నిన్న ఉదయం లిఫ్టులో దిగేప్పుడు రహస్యంగా రూపాలి హేండ్‌బేగ్‌లో చేర్చాను. అది రిజల్ట్ చూపించింది. శోభ మనసులోని ఎక్కడ తమ్ముడు మళ్ళీ తప్పు చేస్తాడో అనే భయాన్ని నిజం చేసి పరువుకోసం తను తెచ్చిపెట్టుకున్న తమ్ముడిని తనే గెంటేసేలా చేసింది'' అంటూ ఆగాడు.

తన ఫైల్స్ బ్రీఫ్‌కేసులో సర్దుకుంటూ ''నేను చేసింది కరెక్టు అని నేను అనను. కానీ వయసు, బలం సామర్థ్యం ఉన్న శ్రీనుకోసం వృద్ధాప్యం ముగింట్లో నేను తప్ప మరో తోడు లేని మిమ్మల్ని నిర్లక్ష్యం చెయ్యలేకపోయాను. శోభకి తన తోడబుట్టిన ఇరవై ఏళ్ళ తమ్ముడి భవిష్యత్తు ముఖ్యమైతే, నన్ను కని, పెంచి, చదివించి అలిసిపోయిన మిమ్మల్ని, అమ్మని ఆఖరిదాకా ఏ లోటూ రాకుండా చూసుకోవడం కొడుకుగా నా ధర్మం. ఇదొక్కటే నాకు తోచిన నిజం'' రాఘవ గొంతులో గిల్టీనెస్ లేదు. స్పష్టమైన దృఢమైన అభిప్రాయం ధ్వనించింది.

మూర్తిగారి కళ్ళల్లో నీళ్ళు పేరుకున్నాయి. ఓల్డ్ సిటిజన్స్ అంటే వేస్ట్ సిటిజన్స్‌గా ట్రీట్ చేసే సమాజంలో కొడుకు గొంతులో కన్నవాళ్ళ పట్ల మమకారానికి ఆయన మనసు ద్రవించింది. దగ్గరగా వచ్చి రాఘవ తలని చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా చుంబించారు.

*

